'ఎన్నికల పనులు' 15లోగా పూర్తికావాలి

- పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు ఏర్పాటుచేయాలి
- పోలింగ్ సిబ్బందికి రేపటిలోగా విధుల ఉత్తర్వులు అందించాలి
- 1, 2 తేదీల్లో ఖమ్మంలో శిక్షణ కార్యక్రమాలు: కలెక్టర్ వీపీ గౌతమ్

మామిళ్లగూడెం, మార్చి 27: పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పన పనులను ఏప్రిల్ 15లోగా పూర్తి చేయాలని కలెక్టర్ వీపీ గౌతమ్ అధికారులను ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాల కల్పనపై ఆయా శాఖల అధికారులతో ఐడీవోసీలో బుధవారం ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాల కల్పన పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. 'మన ఊరు – మన బడి', 'అమ్మ ఆదర్శ పాఠశాలల' కార్యక్రమాలకు ఎంపికైన పాఠశాలల్లో ఇంకొన్ని పనులు పురోగతిలో ఉన్నాయని అన్నారు. వాటన్నింటినీ త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు వేర్వేరుగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏప్రిల్ 23 నాటికి పాఠశాలల సెలవు దినాలు ప్రారంభమైతే ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అందుబాటులో ఉండరు కాబట్టి ఏప్రిల్ 15లోపే పనులు పూర్తయ్యేలా పకడ్బందీ కార్యాచరణతో ముందుకుసాగాలని సూచించారు. పాఠశాలల్లో కేవలం ఎన్నికల వసతుల్లాగానేగాక శాశ్వత ప్రాతిపదికన ఉండేలా వసతులు కల్పించాలని ఆదేశించారు. అలాగే, పోలింగ్ సిబ్బందికి ఎన్నికల విధుల ఉత్తర్వులు జారీ చేశామని అన్నారు. సంబంధిత సిబ్బందికి ఆ గురువారంలోగా ఆ ఉత్తర్వులు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలింగ్ సిబ్బందికి ఏప్రిల్ 1, 2 తేదీల్లో ఖమ్మం మహిళా డిగ్రీ కళాశాల, ఎస్ఆర్ బీజీఎన్ఆర్ కళాశాలల్లో శిక్షణలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శిక్షణ కేంద్రం వద్దనే ఎన్నికల విధుల సిబ్బందికి

మాట్లాడుతున్న కలెక్టర్ వీపీ గౌతమ్

ఫారం–12, ఫారం–12ఏ బ్యాలెట్లు అందజేయనున్నట్లు చెప్పారు. అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, శిక్షణ సహాయ కలెక్టర్ యువరాజ్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, వివిధ శాఖల అధికారులు చంద్రమౌలి, సోమశేఖరశర్మ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛాయుత ఎన్నికల నిర్వహణకు చర్యలు: కలెక్టర్

మామిళ్లగూడెం, మార్చి 27: జిల్లాలో లోకసభ ఎన్నికలను స్వేచ్ఛాయుతంగా, న్యాయబద్ధంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ అధికారులకు సూచించారు. ఎన్నికల సందర్భంగా డబ్బు, మద్యం, ప్రలోభాల జప్తులు వంటి అంశాలపై ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టీ సభ్యులు, ఎక్సైజ్, వ్యయ నియంత్రణ కమిటీ బాధ్యులతో నూతన కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో డబ్బు, మద్యం, ప్రలోభాలను నియంత్రించడానికి పటిష్ట చర్యలు చేపట్టాలని సూచించారు. ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టీలలో సీజ్ అయిన వాటికి వెంటనే ఎఫ్ఐఆర్ నమదయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చెక్‌పోస్టుల్లో అన్ని రకాల వాహనాలను తనిఖీలు చేయాలన్నారు. జప్తు సందర్భంలో నియమ నిబంధనలు పాటించాలన్నారు. అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, వివిధ శాఖల అధికారులు మురళీధర్‌రావు, ప్రసాద్‌రావు, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

'ఆవిష్కార్' పోస్టర్ ఆవిష్కరణ

కొణిజర్ల, మార్చి 27: మండలంలోని విజయ ఇంజినీరింగ్ కళాశాలలో ఏప్రిల్ 3, 4 తేదీల్లో జరగనున్న నేషనల్ లెవల్ టెక్నికల్ సింపోజియం, కల్చరల్ ఈవెంట్స్(ఆవిష్కార్–2024) పోస్టర్‌ను యాజమాన్యం బుధవారం ఆవిష్కరించింది. కళాశాల చైర్మన్ పారుపల్లి ఉషాకిరణ్‌కుమార్, వైస్ చైర్‌పర్సన్ పి.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బకాయిదారుల ఇళ్లకు కేఎంసీ కమిషనర్

పెండింగ్ పన్నులు చెల్లించాలని ఆదేశం

రాయితీని వినియోగించుకోవాలని సూచన

ఖమ్మం, మార్చి 27: ఇంటి పన్నుల బకాయిదారుల ఇళ్లకు కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి బుధవారం వెళ్లారు. పెండింగ్ పన్నులు చెల్లించాలని ఆదేశించారు. ఇంటి పన్ను వడ్డీపై రాయితీ చెల్లించడానికి మరో నాలుగు రోజులు మాత్రమే గడువు ఉన్నందున బిల్ కలెక్టర్లు, స్పెషల్ ఆఫీసర్లు కలిసి బకాయిదారుల ఇళ్లకు వెళ్లి సాధ్యమైనంత వరకు ఇంటి పన్నులు వసూలు చేసేలా కృషిచేయాలని సూచించారు. ఖమ్మం నగరంలోని బుధవారం పర్యటించిన కమిషనర్.. శ్రీనివాస్‌నగర్, ముస్తాఫానగర్‌లలో ఎక్కువ పన్నులు చెల్లించాల్సిన ఇళ్ల వద్దకు వెళ్లి వారితో మాట్లాడి పన్నులు కట్టాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ రోజు పన్నులు చెల్లించాల్సిందేనని స్పష్టం చేశారు. దీంతో కొందరు తక్షణమే స్పందించి పన్నులు చెల్లించారు. ఇంకా కొంతమంది ఈ రెండు రోజుల్లో చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ఇదేవిధంగా ప్రతి ఒక్క బిల్ కలెక్టర్ కూడా ఇంటి పన్ను బకాయిలు ఎక్కువగా ఉన్న వారి ఇళ్లకు వెళ్లి వారితో పన్నులు చెల్లించేలా కృషిచేయాలని సూచించారు. ఎవరైతే గత సంవత్సరం, ఈ సంవత్సరం పన్నులు చెల్లించకుండా ఉంటారో వారిని గుర్తించాలని, వారు పన్నులు చెల్లించకుంటే వారి నీటి పంపు కనెక్షన్ తొలగించాలని ఆదేశించారు. పాఠశాలల భవనాలు, కళశాలల భవనాలు, షాపింగ్ కాంప్లెక్స్ భవనాల పన్నులు పెండింగ్‌లో ఉంటే సంబంధిత బాధ్యులకు నోటీసులు అందించాలని సూచించారు. అయినప్పటికీ వారు స్పందించకుంటే తదుపరి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న కేఎంసీ కమిషనర్

మౌలిక సదుపాయాలను కల్పించాలి

పోలింగ్ కేంద్రాల పరిశీలనలో కమిషనర్ ఆదర్శ్ సురభి

ఖమ్మం, మార్చి 27: పోలింగ్ కేంద్రాల్లో అన్ని మౌలిక వసతుల కల్పించాలని కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. ఖమ్మంలోని కొత్తూరు, శాంతి నగర్ ప్రభుత్వ పాఠశాలలను బుధవారం ఆయన సందర్శించారు. ఆయా పాఠశాలల్లోని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, టాయిలెట్ తదితర సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమున్నచోట పెయింటింగ్ వేయాలని, టాయిలెట్లలో రన్నింగ్ వాటర్ ఉంచాలని సూచించారు. ఫ్యాన్లు, లైట్లు సరిపడా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. భద్రతాపరంగా చర్యలు తీసుకోవాలని, కాంపౌండ్ వాల్ లేని పోలింగ్ కేంద్రాలకు వెంటనే కాంపౌండ్ వాల్ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. స్వీప్ కార్యాచరణలో భాగంగా కాంపౌండ్ గోడలపై ఓటరు అవగాహనకు సంబంధించిన నినాదాలు రాయించాలన్నారు. భద్రత పరంగా అన్ని చర్యలు చేపట్టాలన్నారు. ఎన్నికల విధుల సిబ్బందికి వసతి కోసం ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ

వాహనాలను తనిఖీ చేస్తున్న ఫ్లయింగ్‌స్క్వాడ్

మధిర, మార్చి 27 : లోక్‌సభ ఎన్నికల కోడ్ అమలులో భాగంగా రాష్ట్ర సరిహద్దుల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. బుధవారం మధిర–రాయపట్నం అంతర్ రాష్ట్రీయ చెక్‌పోస్టు వద్ద ఫ్లయింగ్‌స్క్వాడ్ అధికారి శ్రీనివాసరావు తనిఖీలు నిర్వహించారు. వాహనాలను క్షుణంగా పరిశీలించారు. చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వహించే పోలీసు సిబ్బంది తమకు కనీస సౌకర్యాలు కల్పించాలని శ్రీనివాసరావును కోరారు.

డిగ్రీ కళాశాలకు 'ఐఎస్‌వో సర్టిఫికెట్'

మధిర, మార్చి 27 : మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఐఎస్‌వో సర్టిఫికెట్ సాధించిన రెండో కళాశాలగా నమోదైంది. కళాశాలలో మౌలిక సదుపాయాలు, విద్యా సంబంధమైన అన్ని విషయాలను ఆడిట్ చేసిన తర్వాత ఈ సర్టిఫికెట్ ఇస్తారు. ఈ సర్టిఫికెట్ కమిషనరేట్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ ఉత్తర్వులను అనుసరించి హెచ్‌వైఎం సర్టిఫికెట్ ప్రైవేటు లిమిటెడ్ వారు అందజేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఏఎల్ఎన్ శాస్త్రి తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ కే రవికుమార్, అధ్యాపకులు ఎస్ ఇందిర, జీ అరుణ, పీసుజాత, కేవీరన్న, ఎస్‌కే అఫ్రోజ్, ఎం శ్రీనివాసరావు, అధ్యాపక బృందం హర్షం వ్యక్తం చేశారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ఖమ్మం రూరల్, మార్చి 27 : వివిధ కారణాలతో మృతిచెందిన బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బెల్లం వేణుగోపాల్ అన్నారు. మండలంలోని తనగంపాడు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త నర్రా సంజీవ్ మంగళవారం ఇల్లెందు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఆయన తనగంపాడు వెళ్లి సంజీవ్ మృతదేహం వద్ద నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి సానుభూతి తెలిపారు. ఆయన వెంట పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

బుచ్చయ్యకు నివాళి

కూసుమంచి(నేలకొండపల్లి), మార్చి 27 : నేలకొండపల్లిలో అనారోగ్యంతో మృతిచెందిన దేశబోయిన బుచ్చయ్యకు మండల పార్టీ అధ్యక్షుడు ఉన్నం బ్రహ్మయ్య బుధవారం నివాళి అర్పించారు. కార్యక్రమంలో కనక ప్రసాద్, దాసరి ఉదయ్, లింగ ఎలమంద, మాదాసు ఆదారం, కాంతారావు, శ్రీకాంత్, స్రవంత్ పాల్గొన్నారు.

టీటీ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం ఎన్నిక

ఖమ్మం సిటీ, మార్చి 27: టేబుల్ టెన్నిస్ ఖమ్మం జిల్లా అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని నగరంలోని సీక్వెల్ రిసార్ట్స్‌లో బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బాలసాని విజయ్, కార్యదర్శిగా ఓలేటి సాంబమూర్తి, గౌరవ అధ్యక్షులుగా కొండ శ్రీధర్, డాక్టర్ జొన్నలగడ్డ శశికుమార్, రాయల సతీశ్‌బాబు, సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా అనుమోలు శృతి, వైస్ ప్రెసిడెంట్‌గా కోటగిరి ప్రవీణ్, జంగా కార్తీక్, డాక్టర్ రవి, డాక్టర్ ఎంజీవీ ప్రవీణ్, పిట్టల కామేశ్వరి, ఉప కార్యదర్శిగా పర్సా శ్రావ్య, జాజి చాకో, కోశాధికారిగా పరిటాల చలపతి, కార్యవర్గ సభ్యులుగా రెడ్డి సాయిశివ, గౌరిశెట్టి భవ్య చందు, సంపెట ఉపేందర్, వీ రాంచందర్, జవహర్‌పాషా, కాంపాటి నితీన్, ఆనెం రాజేశ్, లీగల్ అడ్వయిజర్‌గా సయ్యద్ పాషా, కన్వీనర్‌గా ప్రవీణ్‌కుమార్ నియమితులయ్యారు. ఎన్నిక పరిశీలకులుగా రాష్ట్ర టేబుల్ టెన్నిస్ అసోసియేషన్‌కు చెందిన నరసింహారెడ్డి, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ నుంచి అథ్లెటిక్స్ కోచ్ గౌస్ వ్యవహరించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు బాలసాని విజయ్ మాట్లాడుతూ.. వచ్చే నెలలో ఖమ్మంలో రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలను నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతీ మండల కేంద్రంలో టీటీ క్రీడాభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తామని అన్నారు.

ఎన్నికైన టీటీ అసోసియేషన్ జిల్లా కార్యవర్గ బాధ్యులు

'పల్స్' హాస్పిటల్లో అరుదైన ఆపరేషన్

జీర్ణాశయానికి అడ్డుగా పేరుకుపోయిన వెంట్రుకల తొలగింపు

ఖమ్మం సిటీ, మార్చి 27: నగరంలోని పల్స్ ఆసుపత్రిలో బుధవారం అరుదైన ఆపరేషన్ జరిగింది. సుమారు పదకొండేళ్ల బాలిక శరణి కడుపులో 25 సెంటీమీటర్ల పొడవు, 10 సెంటీమీటర్ల వెడల్పుతో జీర్ణాశయానికి అడ్డుగా పేరుకపోయిన వెంట్రుకలను తొలగించారు. ఈ సందర్భంగా ఆ ఆసుపత్రి వైద్యుడు అన్వర్ మాట్లాడుతూ.. కడుపులో నొప్పితో బాధపడుతున్న ఆ చిన్నారిని ఆమె తల్లిదండ్రులు అనేక ఆసుపత్రులకు తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని తెలిపారు. చివరకు తమ వద్దకు వచ్చిన బాలికలను అన్ని విధాలా పరీక్షించామన్నారు. కడుపులో జీర్ణాశయానికి అడ్డుగా వెంట్రుకలు పేరుకపోయినట్లు గుర్తించామన్నారు. వైద్యుడు ఆనంద్‌గౌడ్‌తో కలిసి ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం ఆ బాలిక కోలుకుంటున్నట్లు తెలిపారు. వెంట్రుకలు తినడం అనేది ఒక జబ్బు అని, దీనిని ట్రైకోఫేజియా అంటారని వెల్లడించారు.

జిల్లా అభివృద్ధికి విజన్ డాక్యుమెంట్ రూపొందిస్తాం

నాకు అవకాశమిచ్చిన పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు: బీజేపీ అభ్యర్థి తాండ్ర

ఖమ్మం, మార్చి 27: జిల్లా అభివృద్ధి కోసం పాటుపడతానని బీజేపీ ఖమ్మం పార్లమెంటు నియోజకవర్గ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు అన్నారు. తాను ఇక్కడి వాడినేనని, ఇక్కడి సమస్యలన్నీ తనకు తెలుసునని అన్నారు. జిల్లా అభివృద్ధి కోసం మేధావులు, విద్యావంతులు, అనుభవజ్ఞులతో చర్చించి ఓ విజన్ డాక్యుమెంట్‌ను తయారుచేస్తామని అన్నారు. తనపై నమ్మకంతో ఖమ్మం అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించిన ప్రధాని మోదీ సహా పార్టీ పెద్దలు జేపీ నడ్డా, కిషన్‌రెడ్డిలకు ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని అన్నారు. ఖమ్మంలోని ఓ ప్రైవేటు హోటల్లో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అయోధ్య నుంచి భద్రాచలం వరకు ఆధ్యాత్మిక కారిడార్‌ను తీసుకొస్తామని అన్నారు. 30 ఏళ్ల అనుభవంతో అభివృద్ధి చేసి చూపుతానని, కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని అన్నారు. పార్టీ నాయకుడు నంబూరి రామలింగేశ్వరరావు మాట్లాడుతూ.. తాండ్ర వినోద్‌రావుకు బీజేపీ టికెట్ రావడంతో కాంగ్రెస్‌కు అభ్యర్థులు కరువయ్యారని విమర్శించారు. ఆ పార్టీ నాయకుడు గల్లా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. కాగా, రెండేళ్ల క్రితం ఆత్మహత్య చేసుకున్న బీజేపీ కార్యకర్త సాయిగణేశ్ కుటుంబాన్ని వినోద్ రావు పరామర్శించారు. తరువాత స్తంభాద్రి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు

నేడు ఖమ్మం బార్ అసోసియేషన్ ఎన్నికలు

ఖమ్మం లీగల్, మార్చి 27: ఖమ్మం జిల్లా బార్ అసోసియేషన్ ఎన్నికలు గురువారం జరుగనున్నాయి. రాష్ట్ర బార్ కౌన్సిల్ ఆదేశాల మేరకు రాష్ట్రంలోని అన్ని బార్ అసోసియేషన్లకు ఈ ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో జిల్లా బార్ అసోసియేషన్‌కు గురువారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు ఖమ్మం కోర్టు ప్రాంగణంలో ఎన్నికలు జరుగుతాయని, ఈ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునే న్యాయవాదులు తమ వెంట బార్ కౌన్సిల్ జారీ చేసిన ఓటరు ఐడీ కార్డును తీసుకొని రావాలని ఎన్నికల అధికారి మారగాని శ్రీనివాసరావు సూచించారు. పోలింగ్ కేంద్రంలోకి సెల్‌ఫోన్లకు అనుమతిలేదని స్పష్టం చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష పదవికి కన్నెబోయిన నాగేశ్వరరావు, నేరెళ్ల శ్రీనివాసరావు, చిలుకూరి స్వర్ణకుమారి, ప్రధాన కార్యదర్శి పదవికి కొండపల్లి శ్రీనివాస్ చౌదరి, చింతనిప్పు వెంకటేశ్వరరావు, గ్రంథాలయ కార్యదర్శి పదవికి కన్నెగంటి గోపి, దేవరకొండ కల్యాణి పోటీ పడుతున్నారు.

'పేదల స్థలాలను కాజేసేందుకు కాంగ్రెస్ నేతల యత్నం'

మాట్లాడుతున్న గ్రామీణ పేదల సంఘం నాయకులు

ఖమ్మం సిటీ, మార్చి 27: నగర శివారు వెలుగుమట్ల పరిధిలోని సుమారు 62.07 ఎకరాల పేదల భూములు, నివాసాలపై ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి వేజెళ్ల సురేశ్, కాంగ్రెస్ నాయకులు కాజేసేందుకు యత్నిస్తున్నారని గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పడిగ యర్రయ్య ఆరోపించారు. ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రియల్ వ్యాపారి ఇచ్చిన నిరాధారమైన ఫిర్యాదు మేరకు పోలీసులు పేదల ఇళ్లపై దాడులు జరిపారని, వారిపై అక్రమ కేసులు బనాయించారని తెలిపారు. సదరు స్థలాల కేసు హైకోర్టులో ఉన్నప్పటికీ స్థానిక పోలీసులు కొందరికి ప్రయోజనం కోసం దౌర్జన్యానికి పాల్పడుతున్నారని అన్నారు. పేదలకు ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. అదే పేదలపై దాడులకు ఉపక్రమించడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఇళ్ల స్థలాల కమిటీ అధ్యక్షుడు జంగం రాంచందర్, షేక్ అక్తర్, ఉన్నిషాబేగం, దంతోజు సంధ్య, దశరథ గంగమ్మ, షేక్ అనీఫా, మహ్మద్ సహీన తదితరులు పాల్గొన్నారు.

నాచేపల్లిలో సిలువయాత్ర

కూసుమంచి(నేలకొండపల్లి), మార్చి 27 : నేలకొండపల్లి మండలం నాచేపల్లి గ్రామంలో క్రైస్తవులు బుధవారం యేసుక్రీస్తు సిలువయాత్రను నిర్వహించారు. తమ ఆరాధ్యదైవం యేసుక్రీస్తును స్మరించుకుంటూ 40 రోజులు ఉపవాస దీక్షలు చేసిన సభ్యులు చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రాంతికుమార్, మేరీ, వీరబాబు, నాగరాజు, శ్రీకాంత్, పవన్ జయ, దేవసహాయం, చార్లు, ఉషారాణి, ప్రసాద్, రాణి పాల్గొన్నారు.

'ఈజీఎస్ పథకాన్ని ఎత్తివేయవద్దు'

తిరుమలాయపాలెం, మార్చి 27 : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని ఎత్తివేయాలనే ఆలోచనను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకుడు బందెల వెంకయ్య కోరారు. మండలంలోని పిండిప్రోలులో బుధవారం జరిగిన సంఘం పాలేరు డివిజన్ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధిహామీ చట్టాన్ని నీరుగార్చేందుకు బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని అన్నారు. సమావేశంలో నాయకులు రేపాకుల శివలింగం, తిమ్మిడి హనుమంతరావు, సోమనపల్లి వెంకటేశ్వర్లు, సూరమ్మ, రాంబాబు, వెంకన్న, చిరంజీవి పాల్గొన్నారు.

టెట్ ఫీజులు తగ్గించాలి

తిరుమలాయపాలెం, మార్చి 27 : టెట్ పరీక్ష ఫీజులను వెంటనే తగ్గించాలని పీవైఎల్ జిల్లా కార్యదర్శి గొర్రెపాటి రమేశ్ డిమాండ్ చేశారు. తిరుమలాయపాలెంలో బుధవారం జరిగిన సంఘం మండలస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో టెట్ పేపర్–1 ఫీజు రూ.200, పేపర్–రూ.200 మాత్రమే ఉండేదని అన్నారు. ప్రస్తుతం టెట్ ఎంట్రన్స్ ఫీజును రూ.2000 పెంచి నిరుద్యోగులపై సీఎం రేవంత్‌రెడ్డి భారం మోపారని ఆవేదన వ్యక్తంచేశారు. సమావేశంలో ఉమాశంఖర్, బద్రి, గురవయ్య, శ్రీకాంత్, శంఖర్, మోహన్‌రావు పాల్గొన్నారు.

29న వైరాలో చేపల వేట

వైరా టౌన్, మార్చి 27: ఈ నెల 29న వైరా రిజర్వాయర్‌లో చేపల వేట నిర్వహించాలని మత్స్య కార్మిక సంఘం సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. వైరా రిజర్వాయర్ గుట్టల వద్ద అధ్యక్షుడు షేక్ రహీం అధ్యక్షతన బుధవారం ఈ సమావేశం జరిగింది

పంచాయతీ కార్యదర్శులకు జరిమానా

కారేపల్లి, మార్చి 27: ఉపాధి హామీ పథకం పనుల సామాజిక తనిఖీలు బుధవారం ముగిశాయి. మంగళ, బుధవారాల్లో ఎంపీడీవో కార్యాలయంలో బహిరంగ విచారణను డీఆర్‌డీవో ఏపీడీ బి.శిరీష నిర్వహించారు. పనుల నిర్వహణలో అవకతవకలను గుర్తించి, సంబంధిత కార్యదర్శులకు మొత్తం రూ.60వేల జరిమానా విధించారు. ఉపాధి హామీ పథకం ఏపీడీ శ్రీదేవి, ఎంపీవోలు పర్వీన్ కైసర్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసు నమోదు

కారేపల్లి, మార్చి 27: ఓ వ్యక్తి మృతి కారకుడిపై హత్య కేసు నమోదైంది. సీఐ బి.తిరుపతిరెడ్డి తెలిపిన వివరాలు.. మండలంలోని మంగలితండాకు చెందిన ధరావత్ పాండ్యాకు, అతని తమ్ముడి కుమారుడైన వీరబాబుకు మధ్య కొన్నాళ్లుగా గొడవలు జరుగుతున్నాయి. వారిద్దరూ గత నెల 6వ తేదీన కూడా గొడవ పడ్డారు. ఈ క్రమంలోనే కోపోద్రిక్తుడైన వీరబాబు.. తన పెదనాన్న పాండ్యా నోట్లో పురుగుల మందు పోసేందుకు ప్రయత్నించాడు. ఇద్దరి మధ్య పెనుగులాట జరిగింది. పాండ్యా నోట్లో, కంట్లో పురుగుల మందు పడింది. దీంతో పాండ్యాకు క్రమ క్రమంగా కంటి చూపు మందగించింది. ఆయనను కుటుంబ సభ్యులు ఈ నెల 14న ఖమ్మంలోని ఆసుపత్రిలో చేర్పించారు. అదే రోజున, ధరావత్ రాంబాబుపై కారేపల్లి పోలీస్ స్టేషన్‌లో పాండ్యా కుమారుడు ఫిర్యాదు చేశాడు. హత్యాయత్నం కేసును ఎస్సై రాజారాం నమోదు చేశారు. కోర్టు ఆదేశంతో 24న రిమాండుకు తరలించారు. ఖమ్మం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పాండ్యా బుధవారం మృతి చెందాడు. దీంతో, ధరావత్ వీరబాబుపై ఉన్న హత్యాయత్నం కేసును హత్య కేసుగా పోలీసులు మార్చారు.

పోలింగ్ బూత్ పరిశీలన

మధిర రూరల్, మార్చి 27: మండలంలోని మహాదేవపురం గ్రామంలో పోలింగ్ బూత్‌ను బుధవారం అడిషనల్ కలెక్టర్ సత్యప్రసాద్ పరిశీలించారు. తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంపీవో శాస్త్రి పాల్గొన్నారు.

వనజీవి దంపతులకు సన్మానం

ఖమ్మం రూరల్, మార్చి 27 : హరిత ప్రేమికుడు, పద్మశ్రీ వనజీవి దరిపెల్లి రామయ్య దంపతులను బుధవారం ఘనంగా సన్మానించారు. హైదరాబాద్ అటవీ అకాడమీకి చెందిన 50 మంది ట్రైనింగ్ బీట్ ఆఫీసర్లు మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో ఉన్న రామయ్య స్వగృహంలో వనజీవి దంపతులను కలిశారు. దంపతులకు పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో కూసుమంచి రేంజ్ ఆఫీసర్ ఉమ, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ సురేశ్‌కుమార్, సెక్షన్ ఆఫీసర్ డేనియల్, బీట్ ఆఫీసర్లు హరికృష్ణ, మధుతో పాటు ట్రైనీ ఆఫీసర్లు పాల్గొన్నారు.

వనజీవి దంపతులను సన్మానిస్తున్న అటవీశాఖ అధికారులు

ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌కు హైకోర్టు నోటీస్

వైరా టౌన్/రూరల్, మార్చి 27: గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్నికల కమిషన్‌కు ఎమ్మెల్యే రాందాస్ నాయక్ తప్పుడు సమాచారం ఇచ్చారంటూ హైకోర్టులో బీఆర్ఎస్ నేత, వైరా మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్ పిటిషన్ వేశారు. దీనిని హైకోర్టు స్వీకరించింది. ఏప్రిల్ 19న ధర్మాసనం ముందు విచారణకు హాజరు కావాలని ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌కు నోటీస్ ఇచ్చింది.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తనిఖీ

వైరా టౌన్, మార్చి 27: వైరా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని జిల్లా రిజిస్ట్రార్ అశోక్‌కుమార్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైరా, కొణిజర్ల, ఏన్కూరు మండలాల పరిధిలో తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో రిజిస్ట్రేషన్లు చేశారని ఫిర్యాదులు అందిన నేపథ్యంలో రికార్డులను పరిశీలించారు.

దేవబత్తినికి బెయిల్ మంజూరు

ఖమ్మం రూరల్, మార్చి 27 : ఇటీవల ఓ కేసులో జైలుకు వెళ్లిన బీఆర్ఎస్ పార్టీ నగర యువజన విభాగం అధ్యక్షుడు దేవబత్తిని కిషోర్‌బాబు బెయిల్‌పై విడుదలయ్యారు. కొద్దిరోజుల క్రితం జిల్లా జైలుకు రిమాండ్ ఖైదీగా వెళ్లిన సంగతి తెలిసిందే. బుధవారం బెయిల్ రావడంతో విడుదలయ్యారు. కిషోర్‌బాబుకు బచ్చు విజయ్‌కుమార్, చిరుమామిళ్ల కిరణ్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు స్వాగతం పలికారు.

ప్రకటన

ఇందుమూలముగా నాక్లయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **సత్తుపల్లి బ్రాంచ్** వారు ఇచ్చిన బొగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని **పసుపులేటి సురేష్**, S/o: **రాము, వయస్సు** : 27 సం॥లు, **వృత్తి** : వ్యవసాయం, **నివాసం** : బిల్లుపాడు గ్రామం, తల్లాడ మండలం, ఖమ్మం జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణ